క్లుప్తంగా

ముంగిట్లో వైద్యసేవలు అందిస్తున్నాం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: ప్రతి ఇంటి ముంగిటకు వైద్యసేవలు అందజేస్తున్నట్లు బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష అన్నారు. శ్రీరంగంపల్లె గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలను అందజేశారు. అనంతరం ఇంటి వద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రెజ్వాన, అన్నపూర్ణ, శిరీషా, శివగామి పాల్గొన్నారు.

దోమలను అరికడదాం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ లక్ష్మీనారాయణ

యాదమరి(పూతలపట్టు): దోమలను అరికట్టడం వల్ల దాని ద్వారా వ్యాపించే ప్రాణాంతకమైన జ్వరాల నుంచి కాపాడుకోవచ్చని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని మోర్థానపల్లి గ్రామంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్తులతో మాట్లాడుతూ దోమలు వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా లాంటి ప్రాణాంతకమైన జ్వరాలు వస్తాయని తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు వ్యక్తి గత పరిశుభ్రత తప్పకుండా పాటించాలన్నారు. నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించాలని, లేకపోతే దోమలు లార్వాలుగా ఏర్పడి ఎక్కువ మొత్తంలో విస్తరిస్తాయని తెలిపారు. జ్వరాలు, విరేచనాలు వంటి లక్షణాలు కనపడితే వెంటనే మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు సహకార చక్కెర ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. ఆయన శనివారం షుగర్ ఫ్యాక్టరీకి విచ్చేసి పరిశీలించారు. ఆయన్ను ఫ్యాక్టరీ కార్మికులు కలసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు సహకారాన్ని అందిస్తానని తెలియజేశారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు



దిగువమోదలపల్లెలో వృద్ధులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని దిగువ మోదలపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 35 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, మధుమేహవ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ పావని ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

రవణయ్య సేవలు విలువైనవి



రవణయ్య దంపతులను సన్మానిస్తున్న పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: పీఐయూ ఈఈ రవణయ్య సేవలు విలువైనవని పీఆర్ ఎస్ఈ కే.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పీఐయూ ఈఈ కార్యాలయంలో శనివారం ఈఈ రవణయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎస్ఈ హాజరై మాట్లాడారు. ఉద్యోగులతో స్నేహంగా మెలిగేవారని గుర్తు చేశారు. ఆయన సర్వీసులో పలు ప్రాజెక్టులను పర్యవేక్షించారని చెప్పారు. అందరితో సత్సంబంధాలు నెరిపిన వ్యక్తి అని పేర్కొన్నారు. అనంతరం రవణయ్య భార్య పద్మజలకు జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈ చలపతి, ఏఈ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కల్పవృక్షంపై బాలరాముడి చిద్విలాసం



ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న అర్చకులు

- భక్తిశ్రద్ధలతో స్వామికి ఊంజల్‌సేవ
- నేడు వైభవంగా తెప్పోత్సవం



కల్పవృక్ష వాహనంపై భక్తులను అనుగ్రహిస్తున్న బాలరాముడు



ప్రత్యేక అలంకరణలో బాలరాముడు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో వెలసిన శ్రీ కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి క్షీరసాగర మథనం చేసేటప్పుడు ఉద్భవించిన కల్పవృక్ష వాహన సేవను భక్తితో నిర్వహించారు. ఆలయంలో వేదపండితులచే ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామికి సుగంధపరిమళ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, అర్చనలు, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. ఉభయదారులు మునివెంకటరెడ్డి కుటుంబసభ్యులు స్వామికి భక్తితో తిరుమంజనం, లోకనాథ రెడ్డి కుటుంబసభ్యులు స్వామికి పాలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిప్రపత్తులతో స్వామికి ఊంజల్‌సేవ

సాయంత్రం స్వామికి ఊంజల్‌సేవను వేదపండితులు మంత్రోచ్ఛరణ చేస్తూ నిర్వహించారు. స్వామికి పూజాసామగ్రి, ప్రసాదాలు, గజమాలలు, సుగంధపరిమళ పుష్పాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. స్వామికి వేదపండితులు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉభయకర్తలుగా మొగరాల శంకర్‌రెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు.

కల్పవృక్షంపై ఊరేగిన రామచంద్రుడు

రాత్రి కల్పవృక్ష వాహన సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. క్షీరసాగర మథనంలో ఉద్భవించిన కల్పవృక్షాన్ని దేవతావృక్షంగా భావించి పూజిస్తారు. ఏ చెట్టు అయినా దాని కాయలు మాత్రమే ఇస్తుంది. అయితే కల్పవృక్షం అన్ని రకాల ఫలాలను అందిస్తుంది. భక్తితో కల్పవృక్షాన్ని పూజించి కోరికలు కోరుకుంటే ఫలిస్తాయని దేవతామూర్తులు నమ్మి పూజించినట్లు భక్తులు కూడా పూజించారు. కల్పవృక్ష వాహనంపై బాలరాముడు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. మంగళవాయిద్యాలతో పూజాసామగ్రి, ప్రసాదాలు, సుగంధపరిమళ పుష్పాలు, ఫలాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు ఉత్సవమూర్తికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూప దీపనైవేద్య కైంకర్యాలు సమర్పించారు. భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. విద్యుద్దీపాలంకరణ, సుగంధపరిమళ పుష్పాలతో అలంకరించిన దేవతా వృక్షమైన కల్పవృక్షంపై బాలరాముడు కొలువుదీరి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అనుగ్రహించారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు తీర్చుకొన్నారు. దీనికి ఉభయదారులుగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి, వెంకటరమణారెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు.

నేడు తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రి తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

సుదీర్ఘకాల సేవలు మరువలేనివి



ఏఓ వెంకటేశ్వరన్‌ను దుశ్శాలువతో సత్కరిస్తున్న డీఆర్ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : ముగ్గురు అధికారులు రెవెన్యూ శాఖలో సుదీర్ఘ కాలం చేసిన సేవలు మరువలేనివని డీఆర్ఓ పుల్లయ్య అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం ముగ్గురు అధికారులు ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న డీఆర్ఓ మాట్లాడుతూ ముగ్గురు అధికారులు తమ సర్వీసులో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలకపాత్ర పోషించారని వారి సేవలను కొనియాడారు. డ్వామా పీడీ రాజశేఖర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖపై మక్కువతో ముగ్గురు అధికారులు అంకిత భావంతో పనిచేశారన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో డిప్యూటీ కలెక్టర్ శివయ్య, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వరన్ సేవలు మరువలేనివని చెప్పారు. రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న యువ ఉద్యోగులు సీనియర్లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు అధికారుల దంపతులను దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, రిటైర్డ్ తహసీల్దార్లు అమరేంద్ర బాబు, గుణశేఖర్‌రెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు శివకుమార్, పార్థసారథి, రాజు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో తెలంగాణ మంత్రి



కాణిపాకం: తెలంగాణమంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా శనివారం కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చూశారు. అనంతరం వేదపండితులు స్వామివారి చిత్రపటం అందజేశారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పూతలపట్టు: బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని మండల విద్యాశాఖాధికారి-2 మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం బడికి పోదాం కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 5 ఏళ్లు నిండిన విద్యార్థులు ఇంటి వద్ద ఉండకుండా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కలిసి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. అనంతరం పిల్లలను బడికి పంపకుండా పనికి పంపుతున్న తల్లిదండ్రులను గుర్తించి, వారితో మాట్లాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోనే భారతీయ సంస్కృతి వ్యాప్తి



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ప్రకాష్‌రెడ్డి, ఆముదాల మురళి

తవణంపల్లె: భారతీయ సంస్కృతి వ్యాప్తికి చదువే మూలకారణమని దాత, అమృత భారతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని శనివారం వెంగంపల్లె హైస్కూల్లోని విద్యార్థులకు అమృత భారతి ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో 61 మంది విద్యార్థులకు విద్యాసామగ్రి, పెద్దబాలశిక్ష పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శతావధాని, వెంగంపల్లె పాఠశాల పూర్వవిద్యార్థి ఆముదాల మురళి ప్రసంగిస్తూ దాతలు ఇచ్చిన విద్యాసామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాను చదువుకున్న పాఠశాలలో పిల్లలకు విద్యాసామగ్రి పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. పాఠశాల విద్యార్థులకు రూ.16 వేలు విలువ చేసే విద్యాసామగ్రిని అందజేసిన అమృత భారతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్‌రెడ్డికి హెచ్‌ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయుడు విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయుల బృందం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రుడు, మోహనకృష్ణ, ఇనయతుల్లా, విజయభాస్కర్ రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరీక్ష ఆలస్యం.. వీడ్కోలుకు ప్రాధాన్యం!



పరీక్ష సమయంలో వీడ్కోలు సమావేశంలో అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్ : అభ్యర్థుల పరీక్షకు ప్రాధాన్యనివ్వాల్సింది పోయి....వీడ్కోలు సమావేశానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. ఈ సంఘటన జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాలలో శనివారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ మూడవ సెమిస్టర్ తుది సెమిస్టర్ పరీక్ష నిర్వహించాల్సి ఉంది. ఈ పరీక్షకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అభ్యర్థులు విచ్చేశారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకు పరీక్షను ప్రారంభించి సాయంత్రం 5 గంటలకు ముగించాల్సి ఉంది. అయితే అలా చేయకుండా మధ్యాహ్నం 2 గంటలకు ఓపెన్ యూనివర్సిటీ తుది సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆ సమావేశం కోసం పరీక్షను గంటన్నర సమయం వాయిదా వేశారు. 3.30 గంటలకు పరీక్షను ప్రారంభించి సాయంత్రం 6.15 గంటల వరకు పరీక్షను నిర్వహించారు. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన మహిళలు అవస్థలు ఎదుర్కొన్నారు. పరీక్షలను నిబంధనల ప్రకారం నిర్వహించాల్సిన అధికారులు ఇష్టానుసారం వ్యవహరించడం పట్ల పలువురు అభ్యర్థులు, తల్లిదండ్రులు విమర్శలు గుప్పిస్తున్నారు. పరీక్షల నిర్వహణలో అనుభవజ్ఞులైన పీవీకేఎన్ ప్రిన్సిపల్ జీవనజ్యోతి, అంబేడ్కర్ స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ మీరా సాహెబ్ ఇలా చేయడం ఏంటని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఈ ఘటనపై విచారణ చేసి ఇకపై ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

టెంపో బోల్తా ఆరుగురికి గాయాలు

గుడిపాల: మండలంలోని శనివారం ఓ టెంపో ట్రావెల్స్ బోల్తా పడడంతో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. తెలంగాణ నుంచి బయలుదేరిన వాహనం తమిళనాడులోని గోల్డెన్ టెంపుల్‌కి వెళుతుండగా అనుపు వద్ద ముందు ఓ ప్రైవేట్ బస్సు హఠాత్తుగా ఆగడంతో వెనుక నుంచి ఢీకొంని అదుపు తప్పి ఓ పక్కకు పడింది. దీంతో ఇందులో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు.



పడిపోయిన టెంపో

కార్మిక హక్కుల కోసం పోరాడుదాం



మాట్లాడుతున్న గిరిధర్ గుప్తా

చిత్తూరు కార్పొరేషన్: కార్మిక హక్కుల సాధన కోసం పోరాటం చేద్దామని సీఐటీయూ నాయకులు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా మాట్లాడారు. ప్రజల చైతన్య స్థాయిని పెంచవలసిన అవసరం ఉందన్నారు. ఏ మాటల వెనుక ఏ వర్గ ప్రయోజనం ఉందో ప్రజలు తెలుసుకోకపోతే నష్టపోతూనే ఉంటారన్నారు. కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు చేతివృత్తిదారులు అందరూ ఒక్కటై దోపిడీ వర్గాలను ఓడించాలని ఆయన తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంగరాజు మాట్లాడుతూ దేశంలో కొత్తగా ఏర్పడిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల అవసరాలను గుర్తించిన పాలన చేయాలన్నారు. ఓటుని కొనవచ్చు అనే భావన వదులుకోవాలని, ప్రజలని ఎల్లప్పుడూ మోసం చేయలేరని చెప్పారు. పరిపాలన పారదర్శకంగా ఉండేలా పాలకులు వ్యవహరించాలని అలా కాని పక్షంలో ప్రజలే పాలకులకు గుణపాఠం నేర్పిస్తారన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్ షకీలా, అధ్యక్షురాలు లలిత, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి, 108 యూనియన్ జిల్లా నాయకులు శివ, అంగన్‌వాడీ యూనియన్ కుప్పం, శాంతిపురం నగరి నాయకులు లక్ష్మయ్య శంకర్, శోభ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇంటి వద్దకే పింఛన్లు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని లబ్ధిదారులకు ఈనెల 1వ తేదీన ఇంటి వద్దే పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. 50 డివిజన్లలో 16,536 మంది లబ్ధిదారులుంటే, వీటిని 860 క్లస్టర్లుగా ఏర్పాటు చేసి, 350 మంది సచివాలయ కార్యదర్శులను మ్యాపింగ్ చేశామన్నారు. లబ్ధిదారులు ఎక్కడకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఇంటి వద్దకే కార్యదర్శులు వచ్చి పింఛన్లు అందిస్తారని ఆమె తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించండి

గుడిపాల: రైతులందరికీ గిట్టుబాటు ధర కల్పించాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్ జ్యూస్ ఫ్యాక్టరీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తోతాపురికి కిలో రూ.30 తప్పనిసరిగా ఇవ్వాలని ఆయన ఆదేశించారు. తమిళనాడు నుంచి వచ్చిన వాహనాలను అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిసిందని, చిత్తూరు నియోజకవర్గం నుంచి వచ్చిన వాహనాలకు ముందస్తుగా అనుమతులు ఇవ్వాలన్నారు. కిలో మామిడికాయలకు రూ.30 తప్పనిసరిగా ఇవ్వాలని ఆయన ఫ్యాక్టరీ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల